క్లుప్తంగా

నేటి నుంచి ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ అలంకరణలో ఆలయం

కార్వేటినగరం: సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న శుక్రవారం ధ్వజారోహణం, పాండవ జననంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్టు వెల్లడించారు. 28న పాండవ విద్యాభ్యాసం, 29న లక్కాగృహ దహనం, 30న భకాసుర వధ, 1వ తేదీ మంగళవారం ద్రౌపదీ అమ్మవారి కల్యాణం, 2న ద్రౌపదీదేవీ మాన సంరక్షణ, 3వ తేదీ రథోత్సవం, 4వ తేదీ కీచక వధ, అర్జున తపస్సు, 5న దుశ్శాసన, దుర్యోధన సంహారం, 6న అగ్నిగుండ ప్రవేశం, 7న వసంతోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

నకిలీ విలేకరులపై చర్యలు తప్పవు



ఎస్ఐ వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం: కొందరు జర్నలిస్టులు, పోలీస్‌లు కాకున్నా తమ వాహనాలకు స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కొందరు నకిలీ విలేకరులు ప్రెస్ స్టిక్కర్లును వాహనాలకు అతికించుకుని తిరగడం చట్ట వ్యతిరేకమన్నారు. అదేవిధంగా పోలీస్ స్టిక్కర్లు అతికించుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను సీజ్ చేసి సంబంధం లేని వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటలు



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: ప్రకృతి వ్యవసాయం చేస్తూ అంతర పంటలు వేస్తే రెండింతల లాభాలు రైతులు పొందవచ్చని జిల్లా అధికారి డీపీఎం వాసు, రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గంగాధరనెల్లూరు మండలంలోని పలు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సిబ్బంది రైతులతో కలిసి పరిశీలించారు. పంటల వైవిధ్యం, అంతర పంటల ఉపయోగాలు లాభసాటి వ్యవసాయ పద్ధతులు, వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో అందరూ రైతులు కూడా ఈ విధానాన్ని అమలు చేసి, లాభాల బాటలో నడవాలని ఆయన సూచించారు. అనంతరం గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని శిరీష, మూర్తి నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విత్తనాల దుకాణాన్ని సందర్శించారు. కిచెన్ గార్డెన్ విత్తనాలను కిట్ల రూపంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకి అందించారు.

రేటు చెప్పం.. ఇష్టం ఉంటే అమ్మండి.. లేకుంటే పోండి



కిలోమీటర్ల మేర బారులు తీరిన మామిడి ట్రాక్టర్లు

- దయనీయమైన పరిస్థితిలో మామిడి రైతు
- అంగీకార పత్రాలపై రేటు చెప్పకనే సంతకాల సేకరణ
- సొమ్ము ఎప్పుడు చెల్లిస్తారో తెలియజేయని వైనం
- నాలుగు కిలోమీటర్ల మేర బారులు తీరిన ట్రాక్టర్లు
- పడిగాపులు కాస్తున్న రైతులు

గంగాధరనెల్లూరు: మామిడి రైతుల పరిస్థితి రోజు రోజుకు దయనీయంగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా మామిడి గుజ్జు పరిశ్రమలు చేస్తున్న తీరుపై కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్ట లేకపోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అసలే మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతుంటే ట్రాక్టర్లు దొరక్క ఒక వైపు, వర్షపు చినుకులు ఒకవైపు రైతులను దీనస్థితికి చేర్చేశాయి. ప్రభుత్వం ఎయిట్ ప్లస్ ఫోర్ అని పేరుకే చెప్పినా ఏనాడు అమలు చేయలేదని రైతులు వాపోతున్నారు. సబ్సిడీ కథ దేవుడెరుగు అసలు అమ్మకం ఎనిమిది రూపాయలకా, ఆరు రూపాయలకా, ఐదు రూపాయలా కానీ అర్థం కాని పరిస్థితిలో రైతు మిగిలిపోగా, ఫ్యాక్టరీ యాజమాన్యాలు మాత్రం రైతుల వద్ద వెయిటేజీ అనంతరం తాము నిర్దేశించిన ధరకే అమ్మకాలు జరిగినట్టు నిర్ధారణగా సంతకాలు సేకరిస్తున్నాయి. సంతకాలు సేకరిస్తున్న యాజమాన్యం తమకు డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పడం లేదని రైతులు అంటున్నారు. వర్షపు నీటికి ట్రాక్టర్‌పై తార్పాలిన్ పట్టా కట్టగా ఆ వేడికి సగం మామిడి పంట కుళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు టన్నుల మామిడి కాయలు లోడ్ వస్తే ఫ్యాక్టరీలో అన్‌లోడింగ్ అయ్యే సమయానికి మూడు టన్నులకే పడిపోతున్నాయి. మిగిలిన రెండు టన్నులు కుళ్లిపోతుండగా కూలి ఖర్చులు కూడా రావడం లేదని ట్రాక్టర్ బాడుగ కూడా మిగలడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారాలు గడుస్తున్నా తిండి నిద్ర రోడ్ల మీదే జరుగుతున్న ప్రభుత్వం రైతును ఇంత చులకనగా చూడడం భావ్యం కాదని రైతులు మండిపడుతున్నారు.





జీడీనెల్లూరులోని జైన్ యూనిట్-2 వద్ద మాట్లాడుతున్న రైతులు, ట్రాక్టర్ కింద రోడ్డుపై నిద్రిస్తున్న రైతు, నేలపైనే పడుకున్న మామిడి రైతు

టోకెన్లు అమ్ముకుంటున్నారు



రోజుల తరబడి ట్రాక్టర్లలో మామిడి పంటలతో పడిగాపులు కాస్తున్నాం. కొందరు మాత్రం సిఫారసులతో టోకెన్లు పొంది దర్జాగా నేరుగా వచ్చి మామిడిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. రోజుల తరబడి వేచి ఉన్న మా పంట సగం కుళ్లి, సగం ఫ్యాక్టరీకి చేరడంతో నష్టాలు, అప్పులలో కూరుకు పోతున్నాం. టోకెన్లను వందల సంఖ్యలో వెయ్యి రూపాయలకు అమ్ముకుంటున్నారని అందరూ అనుకుంటున్నారు. –హేమేశ్వర రెడ్డి, గుద్యాణంపల్లి గ్రామం

ఎంత ధరకు కొంటున్నారో తెలియదు



మామిడి పంటను ప్రభుత్వం ఎనిమిది రూపాయలకు కొనమని ఆదేశాలు ఇచ్చినా ఏ రోజు కొనిన పాపాన పోలేదు. మరి ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఎంతకు కొంటున్నారో కూడా అర్థం కాని పరిస్థితి. వెయిటేజీ అనంతరం అంగీకార పత్రాలలో సంతకాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని రైతులకు మేలు కలిగేలా చర్యలు చేపట్టాలి. మామిడి పంట అమ్మకం డబ్బులు ఎప్పుడు ఇస్తారో కూడా తెలపాలి. –ఆనందరెడ్డి, చిన్న వేపంజేరి

సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవు



ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి మామిడి పంట అమ్మకం కోసం ఎదురుచూపులు చూస్తున్న రైతులకు సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవు. ప్రభుత్వం అందించమన్న భోజన సదుపాయం కూడా అరాకొరగానే అందుతుంది. ఒక్క లోడు ట్రాక్టర్ అమ్ముకోవాలంటే వారం రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది . వారం రోజులకు అయ్యే ఖర్చు ఒక్క లోడు అమ్మితే కూడా రావడం లేదు. –గోవిందరాజులు, శెట్టిసేతాంగల్

నిర్దేశిత సమయంలోనే టిప్పర్లకు అనుమతి

నగరి: నిర్దేశిత సమయంలోనే టిప్పర్లు పట్టణ పరిధిలో వెళ్లేందుకు అనుమతిస్తున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రషర్ల నుంచి వచ్చే టిప్పర్లకు పట్టణ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి 7 గంటల వరకు అనుమతించబోమన్నారు. పాఠశాలల సమయాలను అనుసరించి ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నిర్దేశించిన సమయంలోనే టిప్పర్లు ప్రయాణించాలన్నారు.

తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యుడిగా ప్రవీణ్



గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడిగా డాక్టర్ ప్రవీణ్ నియమితులయ్యారు. ఇదివరకు ఆయన చిత్తూరు డీఎంహెచ్ఓ ఆఫీసులో విధులు నిర్వహిస్తూ, బదిలీపై తూగుండ్రం ఆరోగ్య కేంద్రంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

కంది పప్పు పరిశీలన



ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీడీపీఓ పద్మసునందన

పాలసముద్రం: మండలంలోని ఆముదాల, సింహరాజుకుప్పం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ పద్మసునంధన గురువారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో పిల్లలకు అందిన కందిపప్పును పరిశీలించారు. కంది పప్పులో పురుగులు ఉంటే వెంటనే వాటిని తిరిగి ఇచ్చేయాలని కార్యకర్తలను ఆదేశించారు.



వధూవరులకు ఆశీస్సులు

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: కార్తీక్ ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన సదాశివకోన మాజీ చైర్మన్ జయచంద్రన్ సోదరుని కుమార్తె వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు ఉన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

వెదురుకుప్పం: పశువుల్లో నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రూపసుందరి అన్నారు. గురువారం వెదురుకుప్పంలో నులిపురుగులు, నట్టల నివారణకు సంబంధించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 44,500 గొర్రెలు, మేకలకు కడుపులోని నులిపురుగుల నివారణ, వాటి ఎదుగుదలకు దోహదం చేసే నట్టల నివారణకు మందులను అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పశువైద్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పాడి రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్ తెచ్చి మందులు పొంది, పశువులకు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఉప సంచాలకులు గోవిందయ్య, పశువైద్యాధికారి రాజేష్, సిబ్బంది గణేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సంపూర్ణ వైద్యసేవలు అందాలి

నగరి: ఏరియా ఆస్పత్రిలో సంపూర్ణ వైద్యసేవలు అందాలని డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి దేవి అన్నారు. గురువారం నగరి ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ప్రతి వార్డుకు వెళ్లి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై పేషెంట్ల వద్ద ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంకు, ల్యాబ్‌ల నిర్వహణ తీరును పరిశీలించారు. ఓపీలు, ఇన్ పేషెంట్ల వివరాలను సూపరింటెండెంట్ ప్రభావతిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పగలు, రాత్రి తేడా లేకుండా ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు వైద్యసేవలు అందించేందుకు వైద్యులు ఆస్పత్రిలో ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను చెల్లించాలంటూ ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ద్వారా ఆమె దృష్టికి తీసుకురాగా సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించి, జీతాలు చెల్లించే ఏర్పాటుచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ ఆర్‌వీ మంజుల, వైద్యులు జరీనా, ప్రశాంతి, దీప్తి, శ్రీనాథ్, జయంత్, మహేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ పాల్గొన్నారు.

నాలుగో రోజు ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు, పుత్తూరులో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

నగరి: తమ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన నాలుగో రోజుకు చేరుకుంది. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వారు తమ సమస్యలను ప్లకార్డు రూపంలో ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో మున్సిపల్ కార్మికుల ఆందోళన

పుత్తూరు: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన పుత్తూరు మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం ప్లకార్డులు చేతబట్టి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరికి స్థానిక సమాచార హక్కుల వేదిక సంఘ సభ్యులు సంఘీభావం తెలిపారు. మురగారెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిగా సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, గత కొద్ది రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గణేష్ కుమార్, మునెయ్య, మణిగండన్, సురేష్, చంద్రశేఖర్, భారతి, కోమళి, సుభాషిణి, మునికృష్ణ, మణికంఠన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలతో కొండలు కనుమరుగు

- తమిళనాడు రాష్ట్రానికి టిప్పర్‌లో తరలిపోతున్న ఎర్రమట్టి




బలిజకండ్రిగ కొండను తవ్వేస్తున్న హిటాచీలు, తమిళనాడుకి ఎర్రమట్టి గ్రావెల్ తీసుకెళ్తున్న టిప్పర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారంలోని వచ్చినప్పటి నుంచి కూటమి నేతలు, ఎమ్మెల్యే మండలంలోని వనదుర్గాపురం, నరసింహపురం, బలిజకండ్రిగ సమీపంలోని కొండలో గ్రావెల్ ఎర్రమట్టిని జేసీబీలతో తవ్వి, టిప్పర్లతో తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు తరలించేస్తున్నారు. కొన్ని నెలలుగా ఇలా గుట్టల్లోని ఎర్రమట్టిని తీసుకుపోతుండడంతో గుట్టలు కనుమరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మండలంలో ఎన్నడూ లేని విధంగా టిప్పర్‌లో ఇసుక, మట్టి తరలిస్తున్నారు. ప్రజలు అడిగితే టీడీపీ నాయకులు బెదిరింపులు, అడిగేవారిపై కేసులు పెడుతామని బెదిరిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలో అనుమతి లేకుండా గుట్టల్లో గ్రావెల్‌ను టిప్పర్‌లో తమిళనాడుకి తరలిస్తుంటే పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక టిప్పర్‌లో 40 టన్నుల మట్టి, ఇలా రోజుకి వందకుపైగా టిప్పర్లతో తమిళనాడు రాష్ట్రానికి మట్టిని తీసుకెళ్తున్నారు. కొండల్లో నుంచి అనుమతి లేకుండా తమిళనాడుకి గ్రావెల్ తరలించేస్తుంటే ఎవరైనా అడిగితే ఎమ్మెల్యేకు చెందినవి అంటున్నారు. రెండు రోజుల క్రితం బలిజకండ్రిగ సమీపంలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాల గుట్ట వద్దకు గ్రామస్తులు చేరుకుని అడ్డుకున్నారు. గ్రామస్తులు తిరిగి వచ్చేసిన 10 నిమిషాల తర్వాత మళ్లీ కొండలోని మట్టిని జేసీబీ సహాయంతో టిప్పర్లకు లోడ్ చేస్తున్నారు.

తప్పుడు బిల్లులు

ఎర్రమట్టి తీసుకెళ్తున్న టిప్పర్‌లో విజయపురం మండలం బిల్లులు పెట్టుకుని తమిళనాడుకి తీసుకెళ్తున్నారు. అక్రమార్కులు టిప్పర్లు వెళ్తున్నపుడు ఎమ్మెల్యే పేరు చెబుతుండడంతో అధికారులు, పోలీస్ యంత్రాంగం కూడా అటువైపు వచ్చేందుకు ఇష్ట పడడం లేదు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా తమిళనాడుకి గ్రావెల్ అక్రమ తరలింపును అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల కోసం కలెక్టరేట్ వద్ద ఆందోళన



కట్టకింద రామకృష్ణాపురం గ్రామస్తుల ఆందోళన

పుత్తూరు: పాఠశాల స్థాయిని తగ్గించవద్దు అంటూ పుత్తూరు పట్టణ పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురం గ్రామస్తులు గురువారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. తమ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల గత 40 ఏళ్లుగా 5వ తరగతి వరకు కొనసాగుతుండగా ప్రస్తుతం కేవలం 2వ తరగతి వరకే పరిమితం చేయడాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 4 కిలోమీటర్ల దూరంలోని కొత్త తిమ్మాపురం పాఠశాలకు వెళ్లాలంటూ అధికారులు చెప్పడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. తమ గ్రామం నుంచి కొత్త తిమ్మాపురం వెళ్లాలంటూ మధ్యలో చెరువు కలుజు పారుతోందని, తమ పిల్లల ప్రాణాలను ఫణంగా పెట్టి పంపలేమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలను కొనసాగించకుంటే తమ పిల్లల చదువులనే ఆపేస్తామని హెచ్చరించారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కట్టకింద రామకృష్ణాపురంలో అన్ని వసతులతో ఉన్న పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామ పెద్దలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.మురుగేష్ రెడ్డి, కేపీ ఏలుమలైరెడ్డి, పి.సుబ్రమణ్యంరెడ్డి, ఎన్.దేవేంద్రన్, పి.హరిబాబు, పి.సురేష్, పి.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

- డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్
- విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప



డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

నగరి: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలు, మద్యం, దూమపానం అలవాట్లతో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తూ నగరి పట్టణ పరిధిలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అవగాహన లోపంతో చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని, గంజాయి తదితర మత్తుపదార్థాల వినియోగం అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఎక్కువ శాతం యువత మత్తు పదార్థాలను మొదట సరదాగా తీసుకుని, తర్వాత వాటికి బానిసలుగా మారుతున్నారని వివరించారు. దురలవాట్లు జీవితాలతో పాటు, ఆధారపడే కుటుంబాలను సైతం నాశనం చేస్తాయని చెప్పారు. విద్యార్థులు, యువత ఒక లక్ష్యం పెట్టుకుని, ఆ దిశగా కృషి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, యాంటీ ర్యాగింగ్, పోక్సో చట్టాలపై సీఐ విక్రమ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటి బారిన పడి కేసుల పాలై జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, చక్కగా చదువుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకొని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ ర్యాలీలో ఎస్ఐలు, పోలీసులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

పాలసముద్రం: మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. గురువారం ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం, అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మునస్వామి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నివారించాలి

పుత్తూరు: మత్తు పదార్థాల నివారణ అందరి బాధ్యత అని మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని స్థానిక మున్సిపల్, పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా నిర్వహించాయి. స్థానిక ఫైర్ స్టేషన్ నుంచి నగరం రోడ్డు మీదుగా ఆర్డీఎం గేటు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐ సురేంద్రనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, యువత, పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ మాట్లాడుతూ మాధకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి, సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ ఓబయ్య, ఇతర అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

కార్వేటినగరం: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డైట్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో నగర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఛత్ర్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. ఏఎస్ఈఐ మునికృష్ణ, అధ్యాపకులు ధనంజయరెడ్డి, సీఎస్ లత, వైస్ ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం ఆచారి పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

గంగాధరనెల్లూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటితో జీవితాలు నాశనమవుతాయని, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని గంగాధరనెల్లూరు సీఐ శ్రీనివాసంతి తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు గురువారం గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరిస్తూ సీఐ శ్రీనివాసంతి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.